
# అగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





సమైక్య పాలనలో భూ రికార్డుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. భూమి అనుభవదారు ఒకరుంటే, రికార్డుల్లో పట్టాదారు మరొకరు, కబ్జాదారు ఇంకొకరు ఉండేవారు. వీఆర్ఓ మారిండంటే కబ్జా కాలంలో పేర్ల మార్పులు, పాస్ పుస్తకాల్లో భూమి హెచ్చుతగ్గులు ఉండేవి. ఫలితంగా నిత్యం పోలీస్‌స్టేషన్లలో కేసులు, కోర్టుల్లో దావాలు వేసే పరిస్థితి. అలాంటి పరిస్థితిని స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా తాసీల్దార్‌కు రెవెన్యూ అధికారాలు అప్పగించి పది నిమిషాల్లోనే భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఈ పోర్టల్‌తో నేడు భూ సమస్యలన్నీ పరిష్కారమవడమే కాకుండా లెక్కలన్నీ రికార్డుల్లో భద్రంగా ఉన్నాయి. అలాంటి ధరణిని తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ పాత పద్ధతులతో భూ పంచాయతీలు పెరుగుతాయని, దళారీ వ్యవస్థ వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరణి కొనసాగేందుకు సీఎం కేసీఆర్‌కు అండగా ఉంటామని తేల్చి చెబుతున్నారు.

# ధరణి పోతే దళారీలదే పెత్తనం

## కాంగ్రెస్ నేతలపై రైతన్న కన్నెర్ర

### ధరణిని అమలు చేస్తున్న సర్కారే కావాలి

ధరణితో వ్యవసాయ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ తిప్పలు తప్పినయ్. గతంలో మండలాఫీస్ చుట్టూ అనేక సార్లు తిరిగినా పైసలు ఇవ్వకపోతే పట్వారీలు పనిచేయకపోయేది. గతంలో సాక్షులను తీసుకొని దేవరకొండ ఆర్డీఓ ఆఫీసుకు వెళ్లాలంటే టైము, డబ్బులు వృథా అయ్యేది. ధరణి వచ్చినంక ఎమ్మార్వో ఆఫీసులోనే పనులవుతున్నయ్. ఎవ్వరికీ రూపాయి ఇచ్చే పనిలేదు. స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత మరుసటి రోజే రిజిస్ట్రేషన్ అవుతుంది.15 నిమిషాల్లోనే అధికారులు పట్టా పత్రాలు అందిస్తున్నరు. ఆన్‌లైన్‌లో సర్వే నంబర్ కొట్టగానే భూమి వివరాలు తెలుస్తున్నయి. సీఎం కేసీఆర్ సారు తెచ్చిన ధరణితో మా ఇబ్బందులు తీరినయ్, కాంగ్రెస్ నాయకులు ధరణి రద్దు చేస్తామంటున్నరు. రాజకీయాల కోసం రైతులను ఇబ్బంది పెట్టడం సరి కాదు. రైతుల క్షేమం కోరే బీఆర్ఎస్‌కే మా మద్దతు ఉంటుంది.

**– వీరమల్ల రాజు గౌడ్, అంతంపేట, మర్రిగూడ మండలం**



### ధరణితో మా భూములు భద్రంగా ఉన్నయ్



సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో మా భూములు భద్రంగా ఉంటున్నయ్. గతంలో భూములకు సంబంధించిన వివరాలు తెలుసుకోవాలంటే రోజుల పాటు అధికారుల చుట్టూ తిరిగేవాళ్లం. రికార్డులన్నీ అధికారుల చేతిలో ఉండటం వల్ల ఎప్పుడు వివరాలు మారుస్తరో, ఎవరికి పట్టా చేస్తారో తెలియక పోయేది. నేడు ఆపరిస్థితి లేదు. చేతిలో ఫోన్ ఉంటే చాలు యాప్ ఓపెన్ చేసి మా భూమి వివరాలు తెలుసుకునే అవకాశం ధరణితో వచ్చింది. అలాంటి ధరణి ఎత్తేస్తామని, పటేల్, పట్వారీ కాలం తీసుకొస్తామని చెప్పడం చూస్తుంటే రైతులను ఇబ్బంది పెట్టాలని వారు డిసైడ్ అయినట్లు తెలుస్తున్నది. ధరణిలో వివరాలు సక్రమంగా ఉంటడం వల్లే రైతుబంధు డబ్బులు నేరుగా మా ఖాతాలో పడుతున్నాయ్. రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ గంటలోపే పూర్తి అవుతున్నయ్. ధరణి తీసేస్తే రైతులకు మళ్లీ దరిద్రం చుట్టుకుంటుంది. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మే పరిస్థితిలో రైతులు లేరు.

**– మారెళ్ల రాంరెడ్డి, రైతు, వాడపల్లి, దామరచర్ల మండలం**

### ధరణి లేకుంటే రైతులకు కష్టాలే



గతంలో భూములకు భరోసా ఉండేది కాదు. భూములు అమ్ముకున్నా, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు పడరాని పాట్లు పడ్డం. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పుణ్యమాని మధ్య దళారుల బెడద లేకుండా గంటల్లోనే రిజిస్ట్రేషన్ అవుతుంది. మ్యుటేషన్ కూడా వెంటనే అయిపోతున్నది. గతంలో మా పొలం మా పేరుతో ఉందా.. ఎవరైనా తీసేసుకున్నారా అని టెన్షన్ పడాల్సి వచ్చేది. ఇప్పుడు నేను వేలి ముద్ర వేస్తే తప్ప ఎవరు కూడా వారి పేరుపై మార్చుకునే అవకాశం లేదు. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో మా భూములకు భరోసా ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం రాక ముందు పటేల్, పట్వారీ వ్యవస్థతో మస్తుగ ఇబ్బందులు పడ్డం. అప్పుడు పహాణీ కావాలంటే పట్వారీ సంతకం పెట్టాలె, గిర్దావర్, తాసీల్దార్ సంతకాలు పెడితే అయ్యేది. ఇదంతా జరిగేందుకు రెండు నెలలు పట్టేది. డబ్బుల కోసం వాళ్లు తిప్పించుకునేటోళ్లు. ఇప్పుడు ఆ బాధలు లేవు. కాంగ్రెసోళ్లు చెబుతున్నట్లు పట్టా పుస్తకంలో కౌలు రైతుల పేర్లు ఇస్తే పట్టా రైతులకు కౌలు రైతులకు పంచాయితీ మొదలైతది. రైతులు ప్రశాంతంగా ఉండడం కాంగ్రెసోళ్లకు ఇష్టం లేకనే ఇలాంటివన్నీ చెబుతున్నరు. వారి మాటలు నమ్మి ఓటేస్తే రైతుల పరిస్థితి అధోగతే. భూ సమస్యలు లేకుండా ఉండాలంటే ధరణి ఉండాల్సిందే.

**– శవ్వ మాదారు, రైతు, చింతకుంట్ల, కొండమల్లేపల్లి**



### ధరణి లేకుంటే మళ్లీ పాత లొల్లులే

భూములకు సంబంధించిన వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంచడం వల్ల పనులు సులువుగా అవుతున్నయ్. ధరణి ఫోర్టల్‌ను ఎత్తేస్తామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నరు. అలా చేస్తే మళ్లీ రైతుల మధ్య లొల్లి తప్పదు. గతంలో కాంగ్రెస్ పాలనలో రైతుల భూములకు రక్షణ లేకుండా పోయింది. ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేసుకునేటోళ్లు. ఏ పనికైనా లంచం ఇవ్వాల్సి వచ్చేది. నెలల తరబడి అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. సీఎం కేసీఆర్ ధరణి ఫోర్టల్ పెట్టి ప్రతి రైతుకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించారు. వెబ్‌సైట్‌లో సర్వే నంబర్ కొడితే చాలు ఎవరి పేరు మీద ఎంత భూమి ఉన్నది తెలిసిపోద్ది. అందుకే మేమంతా ధరణి కావాలని, మళ్లీ కేసీఆరే సీఎం కావాలని కోరుకుంటున్నం.

**–పడాల సత్తయ్య, మంగమ్మగూడెం, శాలిగౌరారం.**



### కౌలుదారు చట్టంతో రైతుల మధ్య గొడవలు

కాంగ్రెస్ వాళ్లు చెబుతున్న కౌలుదారు చట్టంతో రైతులకు కష్టాలు తప్పవు. ఇప్పటి వరకైతే భూమి ఉన్న రైతులు తాము సాగు చేసేకోలేక పోయిన భూములను ఇతరులకు కౌలుకు ఇస్తున్నారు. కానీ కౌలుదారు చట్టం తెస్తే పట్టా ఉన్న రైతుతో పాటు కౌలు రైతు పేరు కూడా రికార్డుల్లో పెడుతరు. కైలు రైతుకు బప్పందం రాసి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ బప్పందాన్ని అడ్డం పెట్టుకొని కొంత మంది భూమికి అడ్డు తగిలే ప్రమాదం ఉంటుంది. కౌలు సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతరు. దాంతో ఇద్దరి మధ్య గొడవలు, కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ధరణితో భూ యజమానులు సర్వ హక్కులు కలిగి ఎలాంటి ఇబ్బంది లేకుండా భూమిని కౌలుకు ఇచ్చుకుంటున్నరు. కౌలుదారు చట్టంతో రైతులెవరూ భూములు కౌలుకు ఇవ్వకపోవడంతో చిన్న రైతులు బజారున పడే పరిస్థితి నెలకొంటది. రైతులను ఇబ్బందులు పెట్టే చట్టాలు తీసుకొస్తామని చెబుతున్న కాంగ్రెస్ అధికారంలోకి రానియ్యకుండా రైతులందరూ కలిసి కట్టుగా పని చేయాలి.


**– శెట్టి ఈశ్వరయ్య ,చిన్నమాదారం, కనగల్ మండలం**



### 10 హెచ్‌పీ మోటర్లు ఎట్లుంటయో తెలియదు

నాకు 5 ఎకరాల భూమి ఉంది. నాకున్న భూమిలో సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నా. ప్రస్తుతం బోరుకు 3 హెచ్‌పీ మోటరు పెట్టి నీటిని తోడుకొని సాగు చేస్తున్నం. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల విద్యుత్ ఇస్తుండడంతో ఎలాంటి ఇబ్బందులు కలుగడం లేదు. వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్లు వాడుతారనే విషయమే మాకు తెలియదు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నడు. మరి ఆ మోటర్లు మాకు ఎవరు కొనిస్తరు. పెద్ద మోటర్లు కొనే సామర్థ్యం లేకనే ఇన్నేండ్లుగా 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం చేస్తున్నాం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కరెంటు కోసం ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాం. లోఓల్టేజీ సమస్యతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. కాలిన ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు చేయడం కోసం కనీసం వారం రోజులు ఎదురుచూసే పరిస్థితి ఉండేది. ఈలోపు పొలాలు పూర్తిగా ఎండిపోయేవి. ఇప్పుడు మళ్లీ మూడు గంటల కరెంటు చాలు, 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోండి అంటూ చెబుతున్నరు. మళ్లీ ఆ కరెంటు కష్టాలు మాకొద్దు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అందిస్తున్న 24 గంటల నాణ్యమైన విద్యుత్‌తో పాటు, పంట పెట్టుబడి సాయంతో రైతుల కష్టాలు తీరినై. ఇంత మంచిగా కరెంటు ఇస్తున్న సమయంలో ఓట్ల కోసం కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి 3 గంటల కరెంటు చాలు, 10 హెచ్‌పీ మోటర్లు వాడాలని చెప్పడం మంచిది కాదు. ఎవరు ఏమి మాట్లాడినా కేసీఆర్ లాంటి వ్యక్తి సీఎంగా ఉంటేనే రాష్ట్రంలో రైతులకు మేలు కలుగుతున్నది.

**–దుర్గం లింగయ్య, రైతు, బొప్పారం, కేతేపల్లి మండలం**



# మూడు గంటలన్నోళ్ల మాడు పగులగొడుతం

### కాంగ్రెస్ పాలనలో ఎన్నో ప్రాణాలు పోగొట్టుకున్నాం



గతంలో కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేక, రాత్రి వేళల్లో రాత్రి వేళల్లో ఇవ్వడంతో మోటర్ల దగ్గర, బావుల దగ్గర వెళ్లి రైతులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. మా గ్రామంలో తుంగపాడు వాగులో మోటర్లు పెట్టి నీటిని పొలాలకు పెట్టుకునే రైతులు చాలా మంది రాత్రి వేళల్లో విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు పోగొట్టుకున్నారు. సీఎం కేసీఆర్ సార్ వచ్చినంకనే 24 గంటల విద్యుత్ ఇస్తుండడంతో ఆ బాధలు పోయినై. ఉదయం వేళల్లో ఉప్పుడు అవసరమైతే అప్పుడు వెళ్లి నీళ్లు పెట్టుకుంటున్నరు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ వాళ్లు మూడు గంటలే కరెంట్ ఇస్తమంటున్నరు. మూడు గంటల కరెంట్‌తో మా ఊర్లో మూలమడి కూడా తడవదు. పదెకరాల కంటే ఎక్కువ పొలం ఉన్న రైతులకు 10 హెచ్‌పీ మోటార్ లాభం. చిన్న రైతులకు వాటివల్ల ఏం లాభం. ఇంకా పెద్ద మోటరు పెడితే ట్రాన్స్‌ఫార్మర్ కూడా పెద్దది పెట్టాలె. అవన్నీ ఎవరు పెడ్తరు. రైతులను ఇబ్బందులు పెట్టి వారి ప్రాణాలు తీయడానికే కాంగ్రెసోళ్లు ఇట్లాంటివన్నీ చెబుతున్నరు. నిత్యం రైతులకు అండగా ఉంటూ సరిగా కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం వెంటే రైతులందరూ ఉంటరు.

**– కలకొండ వెంకటేశ్వర్లు, రైతు, రాగడప, త్రిపురారం**

## హస్తానికి ఓటెస్తే కష్టాలు కొనితెచ్చుకున్నట్టే

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు ఇస్తుంటే కాంగ్రెస్ తట్టుకోలేకపోతున్నది. రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తూ ఆనందంగా ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నది. సాగుకు 3 గంటల కరెంట్ చాలని, రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడాలని ఉచిత సలహాలు ఇస్తున్నది. కాంగ్రెస్ అర్థం లేని మాటలపై రైతులు మండిపడుతున్నారు. మూడు గంటలన్నోళ్ల మాడు పగులగొడుతామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతను ఆగం చేయడమే లక్ష్యంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల్లో షాక్ ఇస్తామని హెచ్చరిస్తున్నారు.

### మళ్లీ రైతులను గోస పెట్టేందుకు కాంగ్రెస్ యత్నం



కాంగ్రెసోళ్లు మళ్లీ రైతులను గోస పెట్టడానికే కుట్రలు పన్నుతున్నగా వారి మాటలను బట్టి అర్థమవుతున్నది. 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకుంటే మూడు గంటల కరెంట్ సరిపోతది. రైతులకు 24 గంటలు ఎందుకు అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండు. 10 హెచ్‌పీ మోటరు పెట్టి మూడు గంటలు ఏకధాటిగా నడిపిస్తే బోర్లలో, బావుల్లో ఉన్న నీరంతా దెబ్బకు ఒక్కరోజులో అయిపోతది. ఆ తర్వాత పొలానికి నీళ్లు ఎక్కడ నుంచి తేవాలి. 10 హెచ్‌పీ మోటర్లను అందరూ ఒకే సారి ఆన్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటయా, రోజుకో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కావాలె. యాడికెళ్లి తెస్తరో వాళ్లే చెప్పాలె. కాంగ్రెసోళ్లకు ఇంతన్న ఇంగిత జ్ఞానం లేదు. గతంల కాంగ్రెస్ ప్రభుత్వమప్పుడు సరిగా కరెంట్ ఇవ్వకనే నానా బాధలు పడ్డం. రాత్రిళ్లు పెళ్లాం పిల్లల్ని వదిలి పొలాల్లో దోమల మధ్య పడుకుంటూ కరెంట్ కోసం ఎదురు చూసేటోళ్లం. సీఎం కేసీఆర్ పుణ్యమా అని ఇప్పుడు 24 గంటల కరెంట్‌తో సల్లంగా బతుకుతున్నం. అది ఓర్వలేక కాంగ్రెసోళ్లు మళ్లీ మూడు గంటల కరెంట్ చాలంటూ మా మీద కుట్ర చేస్తున్నరు. 10 హెచ్‌పీ మోటర్లను మంచి ఆసాములే కొనలేరు. మేము ఎక్కడి నుంచి తేవాలె. ఇక నుంచి రైతులను ఆడిపోసుకుంటే ఊరుకోం. రాబోయే ఎన్నికల్లో అలాంటి వారికి ఓటుతోనే బుద్ధి చెబుతం.

**– సంకలమద్ది వెంకటనరసింహారెడ్డి, రైతు, గంధ్రవానిగూడెం, మాడ్గులపల్లి**

### గతంల కాంగ్రెసోళ్లు ఇచ్చిన కరెంట్‌కు మడి కూడా పారకపాయే

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రోజుకు ఆరు గంటల కరెంటు.. అది కూడా మూడు విడుతలుగా ఇస్తే మరి కూడా పారక పోయేది. కరెంటు ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వక పొలం కాడనే కాపలా కూసునేది. రాత్రి పూట గిట్ల పొలం దగ్గర మంటలేసుకొని కూసునేది. ఎంత చేసినా పొలం మొత్తం పారక సగం పంట ఎండిపోయేది. తెలంగాణ వచ్చినంకనే కరెంటు బాధలు పోయినై. కరెంటు కోసం ఇబ్బంది పడేది తెల్వకుండా పోయింది. సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తుండడంతో పొలం మొత్తం నీళ్లు పారుతున్నయ్. మోటర్లు కాలుడనేదే లేకుండా పోయింది. బోర్లలో కూడా మంచిగ నీళ్లుంటున్నయ్. ఈ పదేండ్లలో కరెంటుకు, నీళ్లకు ఏనాడూ ఇబ్బంది పడలే. మళ్ల కాంగ్రెస్‌సోళ్లు వస్తే పాతకాలమే వస్తది. సాగుకు మూడు గంటల కరెంట్ చాలు, 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండు. పెద్ద మోటరు కొనాలంటే యాభైవేల వరకు కావాలె. వైర్లు, పైపులు మార్చుకోవాలె. ఆ మోటరు నుంచి ఒకే సారి నీళ్లు బయటికి వస్తే అంతా వృథా అవుతై. ఇవన్నీ రైతుల గురించి, వ్యవసాయం గురించి తెల్వనోళ్లు మాట్లాడే మాటలు. రైతులను ఇబ్బంది పెట్టే కాంగ్రెసోళ్లు మాకొద్దు. రైతుల గోస తీర్చిన సీఎం కేసీఆరే మాకు కావాలె.

**వల్లపురెడ్డి వెంకట్‌రెడ్డి, రైతు, తిప్పలమ్మగూడం, తిప్పర్తి మండలం**



### 10 హెచ్‌పీ మోటర్ కొనుక్కునే స్థోమత రైతులకు లేదు



10 హెచ్‌పీ మోటర్ కొనుక్కునే స్థోమత రైతులకు లేదు. చిన్న, సన్నకారు రైతులు తమకున్న మూడు, నాలుగు ఎకరాల్లో నీటిని పారించేందుకు 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లే వాడుతరు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే 24 గంటల కరెంట్ మాకు సరిపోతుంది. 10 హెచ్‌పీ మోటర్ కొని పెట్టుకోవాలంటే లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుంది. మరి అంత డబ్బు ఎవరిస్తరు. ఇంకా సాగుకు 3 గంటల కరెంటే చాలంటున్నరు. ఇవన్నీ వ్యవసాయాన్ని నాశనం చేసే మాటలే. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మే పరిస్థితిలో రైతులు లేరు. గతంలో కాంగ్రెస్ పాలనలో ఆరుగంటల కరెంట్ పొద్దున, రాత్రి ఇచ్చేటోళ్లు. రాత్రి పూట మోటర్లు ఆన్ చేయడానికి వెళ్లి అనేక మంది రైతులు కరెంట్‌షాక్‌తో విష పురుగులు కుట్టి మరణించారు. సీఎం కేసీఆర్ రైతులను రాజును చేయాలని చూస్తుంటే.. కాంగ్రెస్ వాళ్లు మాత్రం నిండా ముంచాలని చూస్తున్నరు. కాంగ్రెస్ నాయకుల మాటలను రైతులు నమ్మరు. వారంతా బీఆర్ఎస్ ప్రభుత్వానికే మద్దతు తెలుపుతరు.

**– మెగావత్ రవినాయక్, గాత్‌తండా, తిరుమలగిరి(సాగర్)**

### మూడు గంటల కరెంటు అంటే రైతు మునుగుడే



నాకున్న ఇరవై ఎకరాల భూమిలో ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేస్తున్న. దీనికి బోరు ద్వారా నీటిని అందిస్తున్న. ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల ఉచిత కరెంటు ఇస్తుండడంతో పంటలకు అవసరం ఉన్న సమయంలో నీటిని అందిస్తున్నం. ఇక కాంగ్రెస్ పార్టీ 3 గంటల కరెంటు అంటే మా భూములు తడిసినట్టే.. మా పంటలు పండినట్లే. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో సరిగా కరెంటు ఇవ్వకనే రైతులు నిండా మునిగి ఆత్మహత్యకు పాల్పడ్డరు. వాళ్లనను నమ్ముకుంటే ఇగ అంతే. 10 హెచ్‌పీ మోటరు పెట్టుకొమ్మని ఉచిత సలహాలు ఇస్తున్నరు. అసలు వాళ్లకు వ్యవసాయం గురించి తెలుసా.. కాంగ్రెసోళ్లకు రైతులంటే ప్రేమ లేదు. గతంలో ఇట్నే చేసి రైతులను నిండా ముంచినరు. ఇప్పుడు వాళ్ల మాటలు నమ్ముకుంటే మొత్తం మునుగుతం.

**– సురిగి ఎట్టయ్య, అంతంపేట, గట్టుప్పల్ మండలం**